

ఇది కదా అభివృద్ధి

నాడు: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు తాగడానికి నీరు బాటిల్‌తో తెచ్చుకోవాల్సి వచ్చేది. ఆ తర్వాత జీవీఎంసీ రెండు రోజులకు ఒకసారి వాటర్ క్యాన్‌లు సరఫరా చేసేది. క్యాన్లలో వచ్చే నీరు సరిపోక పోయినా, వాటర్ క్యాన్ల సరఫరా ఒకరోజు నిలిచిపోయినా.. విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడేవారు. వేసవిలో జీవీఎంసీ సరఫరా చేసే వాటర్ క్యాన్లు సరిపోక తాగునీటి ఇబ్బందులతో పాఠశాల సమీపంలోని బోరు నీరు తాగాల్సి వచ్చేది.

నేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సర్కారు బడుల్లో విద్యార్థుల తాగునీటి ఇక్కట్లు తీరాయి. కార్పొరేట్ స్కూళ్లలో సైతం లేనివిధంగా జీవీఎంసీ పాఠశాలల్లో లక్షల రూపాయలు వెచ్చించి బల్క్ ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశారు. నిరంతరం ఆర్వో ద్వారా మినరల్ వాటర్ వచ్చేలా ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఇంటి నుంచి వాటర్ బాటిల్ తీసుకొచ్చే పని, బోరు వద్దకు వెళ్లే పని లేకుండా పోయింది.

సర్కారు బడిలో.. స్వచ్ఛమైన తాగునీరు

- పాఠశాలల్లో బల్క్ ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- విద్యార్థులందరికీ మినరల్ వాటర్
- ఇంటి నుంచి నీరు తీసుకొచ్చే పనికి స్వస్తి
- పిల్లలు, తల్లిదండ్రుల హర్షం


ముస్లిం తాటిచెట్లపాలెం ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

సీతంపేట: మన బడి నాడు–నేడు కార్యక్రమ అభివృద్ధి పనులతో జీవీఎంసీ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం తాగునీరు అందించేలా ప్రతి పాఠశాలలో బల్క్ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. దీంతో విద్యార్థుల తాగునీటి ఇక్కట్లు తొలగాయి.

సీఎం జగన్ ప్రత్యేక దృష్టి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు. తరగతి గదులు, టాయిలెట్లు, డెస్క్ బెంచీలు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లలో నిరంతరం నీటి సరఫరా ఇలా అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. వీటన్నింటికి తోడు విద్యార్థులకు నిరంతరం సురక్షిత తాగునీటి కోసం బల్క్ ఆర్వో వాటర్ ప్లాంట్లు అందుబాటులోకి తెచ్చారు. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు వేర్వేరుగా, 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్, 44వ వార్డు ముస్లింతాటిచెట్లపాలెం ఉర్దూ పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఇంటి నుంచి వాటర్ బాటిల్ పట్టుకొచ్చే శ్రమ లేకుండా చేశారని పిల్లలు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో వాటర్ క్యాన్‌లో నీరు తాగుతున్న విద్యార్థిని


ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో అధ్వాన వాటర్ క్యాన్లు


హైస్కూల్‌లో ఆర్వో ప్లాంట్


మధురానగర్ హైస్కూల్‌లో ఆర్వో ప్లాంట్ వాటర్ తాగడానికి ఏర్పాటు చేసిన ట్యాప్స్

25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఆర్వో ప్లాంట్ కోసం చేసిన ఖర్చు : రూ.1 లక్ష	
మధురానగర్ ప్రైమరీ స్కూల్‌లో ఆర్వో ప్లాంట్ కోసం చేసిన ఖర్చు : రూ.1 లక్ష	మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య : 706
26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు ఖర్చు : రూ.1.73 లక్షలు	ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య : 500
44వ వార్డు ఎంటీసీ పాలెంలో జీవీఎంసీ ఉర్దూ స్కూల్‌లో ఆర్వో ప్లాంట్ కోసం చేసిన ఖర్చు : రూ.1.73 లక్షలు	ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య : 375

స్కూల్‌కు నీరు తెచ్చుకునే శ్రమ తప్పింది



ఒకప్పుడు తాగడానికి ఇంటి నుంచి ప్రతి రోజూ వాటర్ బాటిల్ పట్టుకొచ్చేదాన్ని. జగన్ మామ వచ్చాక మా స్కూల్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీంతో మా ఇంటి వద్ద కూడా లేని మినరల్ వాటర్ స్కూల్‌లో తాగుతున్నాను. రోజూ వాటర్ బాటిల్ తెచ్చే శ్రమ తప్పింది.
– తస్లీం, ఉర్దూ స్కూల్, ఎంటీసీ పాలెం

మినరల్ వాటర్ బాగుంది



వేసవిలో తాగునీటి కోసం ఇబ్బంది పడేవారం. జీవీఎంసీ నుంచి వచ్చే వాటర్ క్యాన్లు సరిపోయేవి కాదు. స్కూల్ బయట బోరు వద్దకు వెళ్లి నీరు తాగేవాల్సి వచ్చేది. నాడు–నేడుతో మా పాఠశాల అభివృద్ధి చెందింది. ఇప్పుడు మినరల్ వాటర్ తాగుతున్నాం. చాలా రుచిగా ఉంది.
– కావ్యశ్రీ, విద్యార్థిని, మధురానగర్ హైస్కూల్

క్లుప్తంగా

సీఎం జగన్‌కు ఆహ్వానం


సీఎం వైఎస్ జగన్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందిస్తున్న కాంతారావు

సీతమ్మధార: ఈ నెల 15న జరగబోయే తమ వివాహానికి విచ్చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు, కాబోయే భార్య కె.కల్పన కోరారు. ఈ మేరకు బుధవారం వారు అమరావతిలోని నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈవీఎంలపై అవగాహన


ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం)పై ఉద్యోగులకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల అవగాహన కల్పించారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు జరిగేటప్పుడు ఎలా వ్యవహరించాలి, ఈవీఎంలను ఎలా భద్రపరచాలి, ఎలా ఉపయోగించాలనే అంశాలపై ఆమె పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఆనందకుమార్, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

డీసీఐ కార్యాలయంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న డీసీఐ ఉద్యోగులు

సీతమ్మధార: విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్, హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంకుల సౌజన్యంతో బుధవారం సీతమ్మధారలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ) కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రక్తదానం చేసి, ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ క్లబ్ అండ్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎస్.రాజకుమారి, కంధాళ ఛాయా, సురేష్, విశాల్ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు


గౌరీపరమేశ్వరులకు సారె సమర్పిస్తున్న మహిళలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో శ్రీ లలితా మహిళా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేంద్ర గౌరీ సేవా సంఘంలో సారెకు పూజలు చేసిన అనంతరం తిరువీధిలో ఊరేగించారు. ఈ నెల 9 వరకు జరగనున్న మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్నదానం, శనివారం అనుపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సూరిశెట్టి అప్పలకొండ, సూరిశెట్టి అచ్యుతరామ్, కాండ్రేగుల నాగరాజు, శరకం రాజు, శరకం సూరిబాబు, కంద్రపు బ్రహ్మాజీ, రెడ్డి వెంకటరమణ, కట్ట రాము, లలితా గ్రూప్, బుల్లెట్ బాయ్స్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ఘనంగా బాబా సాహెబ్ వర్ధంతి


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు, నాయకులు

సీతమ్మధార: అణగారిన వర్గాల సమాన హక్కుల కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కొనియాడారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో కె.కె.రాజు ఆధ్వర్యంలో బాబా సాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ వంటి మహనీయుల స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మండలి అధ్యక్షుడు అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, శశికళ, రెయ్యి వెంకటరమణ, ఆళ్ల లీలావతి, బర్కత్ ఆలీ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, సీనియర్ నాయకులు పేడాడ రమణికుమారి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, డైరెక్టర్లు ఎన్.రవి కుమార్, రాయుడు శ్రీనివాసరావు, నూకరాజు, అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో..

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబా సాహెబ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సీఐ పిలుపునిచ్చారు. ఎస్‌ఐలు వెంకటరావు, ప్రమీల, సిబ్బంది బి.వరలక్ష్మి, షణ్ముకరావు, నాయుడు, కృష్ణ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీఐ విజయకుమార్, ఎస్‌ఐలు

ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో..

గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి సంస్థ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. సంస్థ డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, ఎంవీవీ సూర్యప్రతాప్, డి.చంద్రం, చీఫ్ ఇంజినీర్ అచ్చి రవికుమార్, ఒ.సింహాద్రి, వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, బి.రామప్రసాద్, ఎస్.మసిలామణి, సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, ఎం.రామకృష్ణ, ఎం.రవీంద్ర, జనరల్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన నివాళి

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూకరాజు ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అక్కడి బాబాసాహెబ్ విగ్రహానికి ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక సాధికారతకు అంబేడ్కర్ చివరి వరకు పోరాటం చేశారని గుర్తు చేశారు. బి.రాజేశ్వరరావు, ఎస్.అప్పారావు, కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

42వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ రెల్లి వీధిలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, నాయకులు ఎస్.ప్రసాదరావు, సబ్బి నూకరాజు, శివ, వేణు, శ్రీనివాస్, చిన్ని, గణేష్, జగన్, శ్రీనివాసరెడ్డి, లోకేష్, సురేంద్రలాల్, రాజు, బాషా, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చేందుకు జగనన్న విశేష కృషి చేస్తున్నారన్నారు. డైరెక్టర్లు ఎస్.రవి కుమార్, ఐ.రవికుమార్, సీనియర్ నాయకులు బి.సరస్వతి, వి.కమలకుమారి, ఎస్.సుబ్బలక్ష్మి, బి.శకుంతల, ఢిల్లీరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- ప్రతిభకు పేదరికం అడ్డురాదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిరూపించారని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు అన్నారు. కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది నివాళులర్పించారు.


42వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆళ్ల శ్రీనివాస్


51వ వార్డులో అంబేడ్కర్ విగ్రహంపై పూలు జల్లుతున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


49వ వార్డులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు, నాయకులు

పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎఫ్.ఆర్.ఖాన్ తదితరులు

సీతంపేట: పాలస్తీనాపై యుద్ధాన్ని ఇజ్రాయిల్ వెంటనే ఆపాలని వక్తలు డిమాండ్ చేశారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ప్రతినిధి వై.విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం విశాలాంధ్ర ప్రచురణాలయం వెలువరించిన 'పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం' పుస్తకావిష్కరణ సభ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. విశ్రాంత పోలీస్ అధికారి ఎఫ్.ఆర్.ఖాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభాధ్యక్షుడు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాల్లో గతంలో పాలస్తీనా విషయంలో కుట్రపూరితంగా వ్యవహరించి పాలస్తీనా యూదులకు భూభాగాన్ని కేటాయించాయని చెప్పారు. క్రమంగా పాలస్తీనాలో యూదుల ఆధిపత్యం పెరిగిందన్నారు. సొంత భూభాగంలో అరబ్బులు పరాయివాళ్లయ్యారని పేర్కొన్నారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ ఘర్షణల నేపథ్యం తెలియని అనేకమంది ఇజ్రాయిల్‌ను సమర్థిస్తున్నారన్నారు. శాసన మండలి మాజీ సభ్యుడు ఎంవీఎస్ శర్మ, పుస్తక సంకలనకర్త ఆచార్య బుడ్డిగ జమిందార్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే రాజ్యాంగ పరిరక్షణ

సీతంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 'రాజ్యాంగ రక్షణ, దళితుల కర్తవ్యం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు ఐకమత్యంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పథకం తరహాలో పట్టణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి దళితులను ఆదుకోవాలని కోరారు. ఏఎంసీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, రవిసిద్ధార్థ, గీతం బాబు, గురుమూర్తి, సాదూ రావు, అలమండ ప్రసాద్, సరస్వతి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. వివరాలిలా.. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై గేట్ నంబర్ 3 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు కనుగొన్నారు. ఇతడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుంది. సుమారు 5.6 అడుగుల ఎత్తు, చామన చాయ శరీరం, ఆకుపచ్చ, తెలుపు రంగు గీతలు గల చొక్కా, ఎరుపు రంగు గల నిక్కర ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. జీఆర్పీ సీఐ సిహెచ్.ధనుంజయనాయుడు ఆదేశాల మేరకు ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా లేదా 98664 13487, 94406 27547 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పడిపూజ

సీతంపేట: శ్రీబాలమురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పార్వతీశ్వరాలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పడిపూజ నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు ధ్యాన మందిరంలో మహా రుద్రాభిషేకం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఉదయం 5.15 గంటల నుంచి కాగడా హారతి, భక్తుల స్వహస్తాలతో పాలు, పంచామృతాభిషేకాలు, నదీ జలాలతో బాబాకు అభిషేకం జరుగుతాయని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మహా రుద్రాభిషేకం చేస్తామన్నారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి 7.30 నుంచి పల్లకీ మహోత్సవం, బాబా భజన, అనంతరం శేజ్ హారతితో కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు చెప్పారు.

వైభవుడి పవిత్రోత్సవాలకు సర్వం సిద్ధం

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఈవో బి.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆలయ అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు పవిత్రాలను సిద్ధం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటిని వైభవుడికి అలంకరించి శనివారం సాయంత్రం పూర్ణాహుతి అనంతరం దాతలు, ఇతర భక్తులకు ఇస్తామన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింటు Bank of India మరియు Vuruti Srinivasa Rao, విశాఖపట్నం వారు యిచ్చిన బోగట్టపై యావన్మందికి తెలియచేయునది ఏమనగా.

నా క్లయింటు Vuruti Srinivas Rao గారు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయుటకు Manju Prakash గారి నుండి అగ్రిమెంటు పొంది యున్నారు. సదరు ఆస్తిని ఇందుకూరి డానియల్ రాజు గారు డాక్యుమెంటు నెం. 61/1950రు గా కొనుగోలు చేసిన తరువాత డాక్యుమెంటు నెం. 1902/1953రు గా ఇందుకూరి వరహాలరాజు గార్కి హక్కు విడుదల దస్తావేజు వ్రాసియుంటిరి. సదరు వరహాల రాజుగారు సదరు ఆస్తిని తేదీ 07-10-1954న వారి భార్య అయిన ఇందుకూరి శాంతమ్మ గార్కి వీలునామా వ్రాసి తేదీ 16-05-1956దీన స్వర్గస్తులైనారు. సదరు శాంతమ్మ గారు, సదరు ఆస్తిని అనుభవిస్తూ డాక్యుమెంటు నెం. 222/1983రు గా వారి కుమార్తె అయిన బసవ జేమ్స్ డేవిడ్ గార్కి వీలునామా వ్రాసి తదుపరి తేదీ 28-11-1984న స్వర్గస్తులైనారు. సదరు ఆస్తిని బసవ జేమ్స్ డేవిడ్ గారు అనుభవిస్తూ ఎవరికి ఎటువంటి లిఖిత పూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా తేదీ 28-07-2006న కాలం చేసియుంటిరి. వారి మరణానంతరం వారి ముఖ్య వారసులు డాక్యుమెంటు నెం. 5329/2021రుగా పంపకం దస్తావేజు ద్వారా సదరు ఆస్తిని పంపకం చేసుకుని సదరు ఆస్తిని అభివృద్ధి చేయునిమిత్తం Siva Sai Projects Nep. by Its Partners R. Krishna Murthy & B. Surya Prakash గార్కి డాక్యుమెంటు నెం. 6205/2021రుగా Development Agreement coupled with General Power & Attorney గా రిజిస్ట్రీ చేసియుంటిరి. సదరు డాక్యుమెంటు నెం. 6205/2021 ద్వారా ఈ క్రింది షెడ్యూలు ఆస్తి Manju Prakash వాటాకు వచ్చియున్నది. కాని సదరు లింకు డాక్యుమెంటు నెం. 61/1950, 1902/1953, 222/1983 మరియు అన్ రిజిష్టర్డు వీలునామా తేదీ. 07-10-1954న వరహాల రాజు గారు వ్రాసినటువంటి వీలునామాలు పోయినవనియు, ఏవిధమైన అన్యాక్రాంతములు చేయలేదనియు సదరు Manju Prakash గారు తెలియచేయుచున్నారు. కావున డాక్యుమెంటు విషయము గాని, ఆస్తి విషయం గాని ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ, ఈ క్రింది చిరునామాకు ఏడు దినములలోగా తెలియచేయవలెను. అట్లు కాని యెడల ఎవరికి ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయుదురు. గడువు తీరిన తరువాత వచ్చు అభ్యంతరములు పరిశీలింపబడవు.

షెడ్యూలు

గ్రేటరు విశాఖపట్నం మున్సిపల్ పరిధిలో గల రైల్వే న్యూ కాలనీ T.S.No. 317 లో గల డొండపర్తి గ్రామములో గల Siva Sai Enclave అపార్టుమెంటులో ఫ్లాటు నెం. SF-4 సెకండు ఫ్లోరు 1000 Sft విస్తీర్ణం మరియు మొత్తం 600 చ॥గ॥ స్థలంలో 27.27 చ॥గ॥ అనిర్దిష్ట మరియు అవిభాగ్యపు స్థలంగా గల ఆస్తికి హద్దులు : **తూర్పు :** డోర్.నెం. 44-25-3 గా గల పీలా ఆనందరావు గారి ఇల్లు, **దక్షిణం :** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర :** డోర్. నెం. 44-25-1, రత్న రెసిడెన్సీ, **ఉత్తరం :** డోర్ నెం. 44-24-20, శ్రీ సిద్ధి నిలయము. ఫ్లాటు నెం. FF2 in సెకండు ఫ్లోరుకి హద్దులు : **తూర్పు :** ఓపెన్ స్పేస్, **దక్షిణం :** స్టెయిర్ కేస్, కామన్ కారిడారు & లిఫ్ట్ **పడమర :** ఈ ఫ్లాటుకి ఫ్లాటు నెం. SF3 కి మధ్య గల జాయింటు గోడ, **ఉత్తరం :** ఓపెన్ స్పేస్.

A.PRASADA RAO, I.S.K.SATYAVENI,
A. RAJESH, G ALEKHYA
Advocates #50-50-33/2/1, Beside Gurudwara,
NH-5 Road, Visakhapatnam. Cell : 9849121666

విశాఖపట్నం
తేది:06-12-2023